

నేడు సఫాయి కర్మచారి ఛైర్మన్ రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సఫాయి కర్మచారి ఛైర్మన్ ఎం.వెంకటేశన్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సఫాయి కర్మచారి ఛైర్మన్ జిల్లా పర్యటనలో భాగంగా 18న శుక్రవారం మధ్యాహ్నాం 2 గంటలకు చిత్తూరు చేరుకుని, 3 గంటలకు జిల్లా కలెక్టర్, ఎస్పి లతో కలసి పారిశుధ్య కార్మికుల కాలనీలను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుపై జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, ఎస్పి, మున్సిపల్ కమిషనర్, చిత్తూరు జిల్లా ప్రధాన ఆసుపత్రి డీన్, జిల్లా కార్మిక సంక్షేమ అధికారి, ఈఎస్ఐసి, ఈపిఎఫ్ అధికారులు, సఫాయి కర్మచారి సంఘ నాయకులతో కలసి ఛైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు చిత్తూరు నుంచి తిరుపతి బయలుదేరి వెళతారని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

నాలుగు దశాబ్దాలుగా...

చస్తే...చావే...!

నీళ్లల్లో పాడె మోయాల్సిందే..



నీళ్లల్లో పాడె మోస్తున్న కస్తూరినాయుడు కండ్రిగ గ్రామస్తులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - నాగలాపురం

ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్, స్పందన... పేరు ఏమైతేనేం.. సమస్యల పరిష్కారానికే జరుగుతుంది.. ఏ సమస్య అయినా 'రీ' ఓపెన్ చేయకూడదని, ఖచ్చితంగా పరిష్కరించేలా చూడాలని, ఎప్పటికప్పుడు సమస్య పరిష్కారం ఎంత వరకూ వచ్చిందో ఫిర్యాదుదారునికి తెలియజేయాలని కలెక్టర్ ప్రతి సోమవారం జరిగే కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్షిస్తూ ఉంటారు.. ఎటువంటి సమస్యలను అధికారులు పరిష్కరిస్తారో తెలియదు గాని, నాగలాపురం మండలంలో నాలుగు దశాబ్దాలుగా ఈ సమస్య నలుగుతూనే ఉంది.. ఆ ప్రాంతంలో ఎవరైనా చస్తే వారి చావుకొచ్చిందన్నమాటే.. శవాన్ని ఇంట్లో పెట్టుకోలేం.. పూడ్చి పెట్టాలంటే ఏరు దాటాల్సిందే.. ఒకవేళ బరువున్న మనిషైతే నీళ్లల్లో నడుస్తూ 'పాడె' మోయడం ఎంత కష్టమో ఆ బాధ పగవాడికి కూడా రాకూడదు.. మరి అంతటి కష్టం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామ పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగ గ్రామానికి వచ్చింది.. 500 మంది జనాభా ఉన్న ఈ గ్రామానికి దగ్గరలో స్మశానం లేదు. అక్కడి ఎంఎల్ఎలకు, అధికారులకు ఈ సమస్య తెలిసినా నిర్లక్ష్యం నిర్లజ్జగా ఉందనే చెప్పాల్సి ఉంటుంది. రూ.70 లక్షలతో ఓ వంతెన కడితే అక్కడి సమస్య పరిష్కారం అవుతుంది.. అయితే పట్టించుకునే 'దిక్కు' లేదు.

కస్తూరినాయుడు కండ్రిగ గ్రామవాసులకు వర్షం వస్తుందంటే భయం.. ఇంట్లో కుండ ఉడుకుతుందో లేదో అని కాదు.. ఎవరైనా చస్తే పాడె మోయడానికి. స్మశానానికి వెళ్లాలంటే అరుణానది సమీపంలో ఉన్న ఈ కాల్వ నీటిలో శవాన్ని ఓ పక్క భుజాలపై మోసుకుంటూ నీటిలో ఈదుకుంటూ వెళ్లి అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారినా, వారి సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. తాజాగా మూడు రోజుల క్రితం తుపాను సందర్భంగా గ్రామంలో నివాసం ఉంటున్న శంకర్ (53) మంగళవారం వేకువజామున అనారోగ్యంతో మృతిచెందాడు. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాల్వలో నీళ్లు పెద్దఎత్తున వచ్చాయి. దీంతో గ్రామస్తులు భవాన్ని భుజాలపై మోసుకుంటూ నడుములోతు నీళ్లల్లో పాడె మోసుకుంటూ తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

వంతెన ఏర్పాటు చేయాలి : మురళి, టిడిపి గ్రామ అధ్యక్షులు



మా గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లేందుకు అరుణానదికి సంబంధించిన కాల్వను దాటి వెళ్లాల్సి ఉంది. వర్షాకాలం వస్తే ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించాలంటే కాల్వలో ప్రవహించే నీటిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. కనీసం ఈ కూటమి ప్రభుత్వంలో అయినా స్పందించి వంతెన నిర్మాణం ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలి.

అంత్యక్రియలకు తప్పని తిప్పలు : రుద్రయ్య, టిడిపి



ప్రతి ఏటా వర్షాకాలంలో మా గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు తప్పని తిప్పలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదివరకు అనేకమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వమైనా మా సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

రూ.70 లక్షలతో అంచనా వేశారు : జయప్రకాష్, పల్లికొండేశ్వర కమిటీ మాజీ సభ్యులు



గత ప్రభుత్వంలో గ్రామస్తులందరూ కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం. సమస్యను వివరించాం. అప్పట్లో కలెక్టర్, ఎంఎల్ఎ ఆదిమూలం సానుకూలంగా స్పందించి దాదాపు 70 లక్షలతో అంచనాలు తయారు చేయించారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. వంతెన నిర్మాణం చేపట్టలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిర్మాణం చేపట్టాలి.

ఆర్టీసీ తీరు మారదా..?

- ప్రయాణికులకు అగచాట్లు తప్పవా ..?



కుప్పం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బస్సును తోసి స్టార్ట్ చేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- కుప్పం రూరల్

ఆర్టీసీ తీరు మారదా..? ప్రయాణికులకు అగచాట్లు తప్పదా..? అంటూ కుప్పం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014-19 మధ్యకాలంలో కుప్పం ఏపీఎస్ ఆర్టీసీ సుమారు 112 సర్వీసులతో ప్రయాణికులకు సేవలు అందిస్తూ లాభాల బాటలో పయనిస్తూ ఉండేది. అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికైన విషయం తెలిసిందే. ఆనాటి నుండి క్రమేపీ కుప్పం డిపో లాభాల బాట నుంచి నష్టాల వైపు సాగింది. అప్పటి రాష్ట్ర మంత్రి, చిత్తూరు జిల్లా పెద్దదిక్కుగా పిలువబడే పెద్దాయన జోక్యమే కుప్పం డిపో నష్టాలకు కారణమని అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం జరుగుతుండేది. క్రమేపీ రాజకీయ పరిణామాలు మారడంతో తిరిగి రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టి కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆనాటి నుంచి బాబు కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఆర్టీసీ ప్రక్షాళనతో నియోజకవర్గ అభివృద్ధి ఆరంభిస్తానంటూ ప్రకటించారు. ఆయన ప్రకటించినట్టుగానే నియోజకవర్గ ప్రజలకు మరిన్ని బస్సు సర్వీసులను అందుబాటులోనికి తీసుకురావడం జరిగింది. అంతేకాక త్వరలో కుప్పం ప్రజలకు విద్యుత్ సాయంతో నడిచే బస్సు సర్వీసులు అందుబాటులోనికి రానున్నట్టు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. అంతేకాక కుప్పం ఆర్టీసీ ప్రక్షాళనలో భాగంగా కుప్పం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పిఎస్.మునిరత్నంను ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులుగా సైతం నియమించారు. కుప్పం ఆర్టీసీ అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని చేస్తున్న స్థానిక ఆర్టీసీ అధికారుల తీరు మాత్రం మారడం లేదనే చెప్పాలి. ఇప్పటికే ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందస్తు సమాచారం లేకుండా బస్సుల సమయాన్ని మార్చడం, సమయపాలన పాటించకపోవడం, రహదారులపై అక్కడక్కడ బస్సులు ఆగిపోవడం వంటివి జరుగుతూనే ఉంది. అయినా అధికారుల తీరుల మాత్రం మార్పు కనిపించడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో కుప్పం నుంచి పలమనేరుకు వెళ్ళవలసిన బస్సు స్టార్ట్ కాలేదని, దాంతో ప్రయాణికులు బస్సు దిగి పట్టరా పట్టు హైలెస్సా.... నెట్టర నెట్టు హైలెస్సా... అంటూ బస్సును తోసి స్టార్ట్ చేయవలసి వచ్చిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు వారి తీరును మార్చుకుని ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో ఆర్టీసీ ఉపాధ్యక్షులు ఈ విషయమై స్పందించి, సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఆర్టీసీ అభివృద్ధికి సహకరిస్తూ, ప్రయాణికుల ఇక్కట్లు తొలగించాలని కోరుతున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వాల్మీకి మహర్షి బోయ కులంలో జన్మించి తన తపస్సు వలన ఋషిగా మారారని, సుమారు 23 వేల శ్లోకాలతో రామయాణాన్ని రచించారని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆశ్వయుజ పౌర్ణమి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో జెసి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీ బాష, ఈడీ బీసీ కార్పొరేషన్ శ్రీదేవి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

కుప్పం టౌన్ : కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు తరాలకు రామాయణ మహా గ్రంధాన్ని అందించిన మహర్షి వాల్మీకి అని విద్యార్థులకు వివరించారు. అలాగే పట్టణంలోని నందమూరి తారక రామారావు విగ్రహ ఆవరణలో వాల్మీకి కులస్తులు వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, కడా పిడి వికాస్ మర్మత్, పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు హాజరయ్యారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాపలనత్తం గ్రామంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాల్మీకి




బైరెడ్డిపల్లిలో..

మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి, ఎంపిపి మొగాసాల రెడ్డప్ప, జెడ్‌పిటిసి కేశవులు, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. నెల్లిమంద, ఆవులపల్లి, సోమల గ్రామాలలో వాల్మీకి కులస్తులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నెల్లిమంద ,ఆవులపల్లి గ్రామాలలో వాల్మీకి చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

పలమనేరు: మండలం పలమాసనపల్లిలో వాల్మీకి బోయ సంఘ నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వెయ్యి మంది వాల్మీకిబోయలు గొల్లపల్లి ఆరిమాను గంగమ్మ ఆలయంలో పూజా కార్యక్రమంతో ప్రారంభించి కొలమాసనపల్లిలోని వాల్మీకి మహర్షి గుడి వరకూ కోలాటాలు, డీజే, వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు.



పలమనేరులో..

ప్రజాశక్తి వార్తకు స్పందన

కొత్త భవనంలోకి సచివాలయం



పాత భవనంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం : వర్షాలకు ఉరుస్తున్న పంచాయతీ భవనం.. తడిసి ముద్ధవుతున్న రికార్డులు అనే శీర్షికన గురువారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో అమర్నాథ్ వెంటనే సచివాలయాన్ని సందర్శించి కొత్త భవనంలోకి సచివాలయాన్ని మార్చు చేయాలని, అలాగే కొత్త భవనం నుంచి పరిపాలన సాగించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే రికార్డులను జాగ్రత్తగా కొత్త భవనంలోకి మార్పు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్‌కి సూచించారు. అధికారులు, కూటమి నాయకులు యతీశ్వర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరితో కలిసి రికార్డులను కొత్త భవనంలో భద్రపరిచారు. గత కొన్ని సంవత్సరాలుగా పాత భవనంలో ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు కొత్త భవనంలో పరిపాలన మొదలుకావడంతో హర్షం వ్యక్తం చేశారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిహెచ్‌సిలలో నిర్మాణ దశలో వున్న బ్లాక్ లెవెల్ హెల్త్ యూనిట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్యఆరోగ్యశాఖ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో 8 బ్లాక్ లెవెల్ హెల్త్ యూనిట్ల నిర్మాణ పనులకు సంబంధించిన పురోగతిపై సంబంధిత మెడికల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యఆరోగ్యశాఖ ద్వారా అందించే సేవలను విస్తృతం చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. మాతా శిశు మరణాల నివారణకు, గర్భిణీ స్త్రీల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి తెలుసుకునేందుకు, గర్భస్థ పిండ ఆరోగ్య సంరక్షణలో భాగంగా నిర్వహించే స్కానింగ్ నిమిత్తం జిల్లాలో పాలసముద్రం, విజయపురం, బొమ్మసముద్రం, కాణిపాకం, తవణంపల్లి, చౌడేపల్లి, బైరెడ్డిపల్లె, శాంతిపురం మండలాలలో బ్లాక్ లెవెల్ హెల్త్‌యూనిట్‌ల నిర్మాణంకు సంబంధించి పనులను కాంట్రాక్టర్లు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవి, పిఆర్‌ఎస్‌ఈ శంకర్ నారాయణ, డిసిహెచ్ ఎస్. డాక్టర్ ప్రభావతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



తవణంపల్లిలో..

ప్రజాశక్తి - రామకుప్పం: అన్నదాతల అభివృద్ధికి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంలో వివిధ పథకాలతో ప్రోత్సాహకాలు అందిస్తున్నారని రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మండలంలోని పంద్యాల మడుగు పంచాయతీ ఎస్.గొల్లపల్లి గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎస్.గొల్లపల్లి బస్టాండ్ నుంచి గంగమ్మ దేవాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఏపిడి రవికుమార్, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఏపీఓ రవి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి భూమిపూజ

ఎస్ఆర్ పురం: మండలంలోని ఏయంపురం పంచాయతీ డిఆర్ఆర్ పురం దళితవాడలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించనున్న మురుగునీటి కాలువలకు, రూ.10లక్షల వ్యయంతో ఎయంపురం ఏఏడబ్ల్యూ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎంపిడిఓ మోహన మురళీ భూమిపూజ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు, పంచాయతీ నిధులతో మంజూరైన రోడ్ల, కాలువలు, ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఏపీవో చంద్రశేఖర్, టీఏ.రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి కేశవులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉమ, ఫీల్డ్ అసిస్టెంట్ ధనరాజ్, మాజీ సర్పంచ్ మణి పాల్గొన్నారు.

తవణంపల్లి: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జోగివారిపల్లె, టి.పుత్తూరు, గురుకువారిపల్లె, ఈచినేరి, కొండ్రాజుకాలువ గ్రామాల్లో రూ.46లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు, పలు అభివృద్ధి పనులకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గురువారం శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఆయన వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్, మండలాధ్యక్షులు వెంకటేష్ నాయుడు, మండల అధ్యక్షులు గాలి దిలీప్‌కుమార్, వేణుగోపాల్ నాయుడు, కొండ్రాజుకాలువ సర్పంచ్ పరంధామ నాయుడు, నియోజకవర్గం ప్రత్యేక అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నూతన రోడ్డు ప్రారంభోత్సవం

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంటలో పల్లె పండగలో భాగంగా చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారి నుంచి కొల్లాగుంట దళితవాడ వరకు రూ.24లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని టిడిపి నాయకులు పవన్ కుమార్ తెలిపారు. గురువారం నూతన రోడ్డును టిడిపి మండలాధ్యక్షులు చెంగలరాయల్ యాదవ్, కార్యదర్శి వాసు, టిడిపి నాయకులు ప్రారంభించారు. మండలాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్న ఎమ్మెల్యే థామస్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

విజయపురం: గురువారం మండలంలోని కోసలనగరంలో పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.6లక్షల నిధులతో సిమెంటు రోడ్డు



రామకుప్పంలో..

నిర్మాణానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ భూమి పూజ చేశారు. తహసీల్దార్ కిరణ్, సీఐ భాస్కర్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, నాయకులు సుధాకర్‌రాజు, బాబు, హరికృష్ణా, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం రాజు, దశరథరాజు, మునిభాస్కర్ రాజు, అశోక్, నారాయణరాజు, మునికృష్ణా, మురళీ పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

కుప్పం రూరల్ : కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ బాబునగర్ గ్రామంలో గురువారం సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి మాట్లాడుతూ తమ పంచాయతీకి అభివృద్ధి పనులు చేయిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ ఆర్‌టిసి ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

బంగారుపాళ్యం: పల్లెల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ ద్రాక్షయని అన్నారు. గురువారం మండలంలోని గుంతూరు పంచాయతీలో ఎన్ఆర్‌జిఎస్ పథకం ద్వారా మంజూరైన సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల వాణిజ్య విభాగ అధ్యక్షులు భాష్యం వంశి చౌదరి, ఫీల్డ్ అసిస్టెంట్ మునిరత్నం పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధి హామీ అధికారులు ప్రజాప్రతినిధులు సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. 'పాయలగుట్ట సమస్యల తిష్ట' అన్న శీర్షికన ప్రజాశక్తిలో కొద్ది రోజల క్రితం వచ్చిన శీర్షికకు పాయలగుట్టలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి గురువారం బీజం పడింది. వీధిలైట్లు లేక, తాగునీటి సౌకర్యం లేక సిమెంటు రోడ్లు లేక ఉరుస్తున్న ఇండ్లలో నివాసం ఉంటున్న ఎస్టీ కులస్తులకు అండగా నిలుస్తూ ప్రజాశక్తి గతంలో వార్త ప్రచురించింది. దీంతో గురువారం గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు తమ గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏపీఓ దినకర్ బాబు సర్పంచ్ రెడ్డప్ప కోటీశ్వరయ్య భాను పంచాయతీ కార్యదర్శి మేనక ఏఎన్ఎం మదనిక గ్రామస్తులు పాల్గొన్నారు.



సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

- నాగిళ్లవారి పల్లెకు ఆగిన రాకపోకలు
- పరిశీలించిన తహశీల్దార్, ఎంపీడీవో

ప్రజాశక్తి- సోమల



తెగిపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపిడిఓ, తహశీల్దార్

పెద్ద ఉప్పరపల్లి నుంచి నాగిళ్లవారిపల్లెకు వెళ్లే రహదారి మధ్యలోని కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు వంక ఉధృతంగా రావడంతో కొట్టుకుపోయింది. దీంతో పెద్దఉప్పర పల్లెకు నాగిళ్లవారి పల్లెకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీవో నారాయణ, తహసిల్దార్ బెన్నురాజ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి అటువైపు నుంచి మనుషులు, పశువులు రాకుండా ప్రమాదాలకు గురికాకుండా కంపలను అడ్డుగా పెట్టి ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు.

రేపు జీ తెలుగు కుటుంబం అవార్డ్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జీ తెలుగు కుటుంబ అవార్డ్స్ పార్ట్ 2 శనివారం సాయంత్రం ప్రసారం చేయనున్నట్లు తిరుపతి జిల్లా జి నెట్ వర్క్ సంస్థ ప్రకటనలో పేర్కొంది. తెలుగు ప్రేక్షకులకు నిరంతరం వినోదాన్ని అందించే ఛానల్ జీ తెలుగు. నటీనటులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం మాదిరిగానే 2024 సంవత్సరానికిగానూ ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సు ఘనంగా నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖులు, జీ తెలుగు తారల సందడితో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమం మొదటి భాగం ఇప్పటికే ప్రసారం కాగా, రెండో భాగాన్ని ప్రసారం చేసేందుకు సిద్ధమైంది. ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను మీముందుకు తెచ్చేందుకు సిద్ధమైంది. అలరించే ప్రదర్శనలు, హదయాన్ని హత్తుకునే క్షణాలు, మరపురాని అనుభవాలతో తెలుగు టెలివిజన్ స్ఫూర్తిని ప్రతిబింబించే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానుంది. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

'బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలి'



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ప్రవీణ్

ప్రజాశక్తి- యాదమరి: బిసిజి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవడం వలన టిబి జబ్బు బారిన పడకుండా కాపాడుకోవాలని సిహెచ్ లక్ష్మీనారాయణ ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెరియంబడి గ్రామంలో జరుగుతున్న 104 ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌తో కలిసి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారిలో టీబీ వ్యాధి ఎక్కువగా వస్తున్న దృష్ట్యా ప్రభుత్వం బీసీజీ వ్యాక్సిన్ అందిస్తోందని తెలిపారు. దీని వలన 20శాతం మందిని టిబి బారిన పడకుండా కాపాడుతోందని, ఈ విషయాన్ని ప్రజలందరూ గుర్తించి వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేందర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి భానుప్రియ, మహిళా ఆరోగ్య కార్యకర్త విజయ్ కుమారి, ఆశాలు లీలావతి, కుమారి, వసంత గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లోనే విజ్ఞానం

విశ్రాంతి ఉపాధ్యాయులు షణ్ముగం పిల్లై



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని విశ్రాంతి ఉపాధ్యాయులు షణ్ముగ పిల్లై అన్నారు. గురువారం మండలంలోని మాధవనగర్ వద్ద బ్రహ్మానంద ఆశ్రమంలో నూతన గ్రంథాలయంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల గ్రామప్రజలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇందులోని పుస్తకాల వలన విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం నాయుడు, రాజశేఖర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, కరణం సంక్షేమ సంఘ సభ్యులు తులసికుమార్, రవీంద్ర ప్రసాద్, హరిహర ప్రసాద్, శంకరన్, రవిచంద్ర పాల్గొన్నారు.

అన్నదానం



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ధర్మరాజు ద్రౌపతి సమేత అమ్మవారి గుడిలో గురువారం ఎంపీటీసీ లతా బాలాజీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ గుడి నిర్మాణం చేపట్టి 14 సంవత్సరాలు పూర్తి కావడంతో గుడిలోని విగ్రహమూర్తులను ఉదయం అర్చకులు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి, పూలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కర్ణం వంశీయులు రూ.15లక్షలు విలువచేసే కొత్త రథాన్ని ఆలయానికి బహుకరించారు. సాయంత్రం ధర్మరాజు సమేత ద్రౌపతి అమ్మవారు పురవీధులలో ఊరేగించినట్లు ఆలయ చైర్మన్ సోమశేఖర్, సర్పంచ్ ధనంజయ వర్మ తెలిపారు.

బంగారుపాళ్యం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానంద ఆశ్రమంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీసత్యనారాయణ స్వామి వ్రతకలప పూజ జరిగింది. శ్రీ సత్యనారాయణ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రసాదం పంచిపెట్టి, అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం నాయుడు, రాజశేఖర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, ఈశ్వరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


అధైర్య పడకండి అండగా ఉంటా: రోజా



ప్రజాశక్తి- విజయపురం: అధైర్య పడకండి.. అండగా ఉంటానని మాజీ మంత్రి ఆర్కే రోజా కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని జగన్నాథపురంలో బాలాజీ కుటుంబాన్ని, మహారాజపురంలో మాజీ ఎంపీటీసీ శివకుమార్ కుటుంబాన్ని, కాళికాపురంలో రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, తాను ఎళ్లవేలలా అండగా ఉంటానని తెలిపారు. మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, నాయకులు గుణశేఖర్ రెడ్డి, రవినాయుడు, భాస్కర్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి, సతీష్ యాదవ్, భాస్కర్ రాజు, పరందామ యాదవ్, హరికృష్ణ ఉన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- సోమల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సోనియా తెలపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు వృద్ధులను పిల్లలను పరీక్షించి వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సోనియా

చెరువులు నిండాలి... 'చేలు' పండాలి..!



తుపానుతో భూగర్భజలాలు పెంపు

ప్రజాశక్తి - డక్కిలి: వర్షాకాలం ప్రారంభం నుంచి భారీ వానలు పడలేదు. దీంతో వరి సాగు పై అంతంత మాత్రంగానే ఆశలు పెట్టుకున్న రైతులకు అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు రబీ సాగుకు భరోసా ఇచ్చాయి. వెంకటగిరి నియోజకవర్గం రాపూరు మండలంలో కండలేరు ప్రాజెక్టు ఉన్నా దానికి అనుసంధానంగా నిర్మించిన బ్రాంచ్ కాలువల పనులు పూర్తికాకపోవడంతో వాటి నుంచి నీటి విడుదల అంతంత మాత్రంగానే ఉండి రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు. రైతులకు చిన్న సాగునీటి వనరులైన చెరువులే పంటల సాగుకు ఆధారం. వెంకటగిరి మండలంలో 102, డక్కిలిలో 62, బాలాయపల్లిలో 92 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో మొన్నటి వరకు నీరు లేక వెలవెలబోతున్నాయి. ఇలాంటి తరుణంలో నాలుగు రోజులుగా కురుసిన వర్షాలకు వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చెరువులు, కుంటలు క్రమంగా నిండుతున్నాయి. ఈ వర్షాలు ఉద్యాన తోటలు, ఆరుతడి పంటలతో పాటు వరిసాగుకు అనుకూలంగా మారాయి. వరి నారుమళ్లు పోసుకునేందుకు ఆలస్యమవుతాయని ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షాలు ఉపశమనం కలిగించాయి. సోమవారం నుంచి బుధవారం వరకు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 226.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొన్నటివరకు చుక్కనీరు లేక వెలవెలబోయిన తిమ్మాయకుంట , సింగమాంబపురం చెరువులు 50 శాతం వరకు , మిగిలిన చెరువులు 25 శాతం నుంచి 40శాతం వరకు నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలియజేస్తున్నారు. వెంకటగిరి మండలంలోని వల్లివేడు, అమ్మవారిపేట, కుమ్మరి గుంట, డక్కిలి మండలం మోపూరు , సంగనపల్లి, దందవోలు చెరువుల్లో తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతుండడం రబి సీజన్ పంటల సాగుపై రైతులకు భరోసా కలిగింది. చెరువులు, కుంటలు, వ్యవసాయ బావుల్లోకి నీరు చేరడంతో పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బోరు బావులు, బావులపై ఆధారపడిన పలువురు రైతులు ఇప్పటికే నార్లు పోసుకొని ఉన్నారు. మరి కొంతమంది రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకునే పను ల్లో నిమగ్నం అవుతున్నారు. ఇక చెరువుల్లోకి చేరుతున్న నీటితో రానున్న రోజుల్లో బోరు బావుల్లో భూగర్భజలాలు పెరిగి ప్రస్తుత రబీ సీజన్ పంటలతో పాటు ఖరీఫ్ పంటలకు ప్రయోజనం ఉంటుందనీ రైతులు చెబుతున్నారు.

కమ్యూనిస్టు నేత రంగనాథం మృతి



ఏపీ రంగనాథం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కమ్యూనిస్టు నేత ఏపి రంగనాథం గురువారం మరణించారు. కుటుంబ సభ్యులను గురువారం సాయంత్రం కుప్పం పట్టణంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఏపీ రంగనాథం తండ్రి ఏపీ వజ్రవేలుశెట్టి సిపిఎం నుంచి 1962లో కుప్పం నియోజకవర్గ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. కమ్యూనిస్టు భావజాలాలను నింపుకున్న ఆయన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారు. చిన్నతనం నుంచి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన అభిప్రాయాలను గౌరవిస్తూ పెరిగారు. రంగనాథం తండ్రి ఆశయాలకు విలువనిస్తూ తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు భావజాలాలతో పేదల పక్షాన నిలుస్తూ నిరంతరం పోరాడారు. గత కొంతకాలంగా రంగనాథం అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన కుమారులు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మరణంపై స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పంలో శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బలిజ కులస్తులు పి.గోపినాథ్, మంజునాథ్, బెండన కుప్పంబాబు, శివశంకర్, సోము, డీకే పల్లి సోము, జనసేన చంద్ర, రాజేంద్ర ప్రసాద్, రాజేంద్ర, కృష్ణమూర్తి, సతీష్ పాల్గొన్నారు.



సదుంలో.. మండల కేంద్రంలోని బలిజ వీధిలో శ్రీ కృష్ణదేవరాయల వర్ధంతి వేడుకలను బలిజ సంఘం నాయుకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బలిజ సంఘం నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం, రమేష్, గణేష్, రామయ్య, గిరి, వెంకటరత్నం, రమణ, గుర్రంకొండ రమణ, శ్రీకాంత్, మునీంద్ర పాల్గొన్నారు.

పంటల రక్షణపై రైతులకు అవగాహన



పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ప్రజాశక్తి- వి కోట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉద్యాన పంటలో తెగుళ్ల ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున వాటి నివారణపై ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత కురగాయలు, పూలతోటలో సస్యరక్షణా చర్యలు చేపట్టడం తప్పనిసరని ఉద్యానశాఖ అధికారిని లక్ష్మీప్రసన్న తెలిపారు.

కూరగాయ పంటలు..

మండలంలో టమోటా పంట విస్తారంగా సాగులో ఉంది. ఈ పంటకు భూమిలో అత్యధిక తేమ ఉండడం వలన కాయలు పగిలిపోయే అవకాశం ఉంటుందని, వాటి నివారణకు పంటపై బోరాన్ 1 గ్రా/లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వాతావరణంలో అధిక తేమ వలన పంటను ఆశించే ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు ముందస్తు చర్యగా పంటకు లీటరు నీటికి 3 గ్రా. మ్యాంకోజెబ్, 2గ్రా. క్లోరోథలోనిన్ లేదా 1గ్రా. డైమిథోమార్ఫ్ మందులను పిచికారి చేయాలన్నారు. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లేదా 2.5గ్రా. కాపర్ హైడ్రాక్సైడ్ ప్లస్ 0.2 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపి పిచికారి చేయాలన్నారు

పూల తోటలు..

గాలిలో తేమ అధికంగా ఉండడం పూలతోటలో నల్లబూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని వాటి నివారణకు మైక్లోబ్యూటానిల్ 1గ్రా. లేదా మిథైల్ 1గ్రాను లీటరు నీటికి కలిపి వారంలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. నేలలో తేమ అధికంగా ఉండటం వల్ల వేరుకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉందని వాటి నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రా. లేదా మెటలాక్సిల్ 3గ్రా. లేదా ట్రైకోడెర్మా పొడిని 5 –10 గ్రా. లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గరగా పోయాలని, మొక్కలపై 13:0:45 (పొటాషియం నైట్రేట్) లేదా 19:19:19లను లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకు మచ్చ, ఆకుమాడు తెగుళ్ల నివారణకు క్లోరో థాలోనిన్ 2 గ్రా. లేదా థయో పినేట్ మిథైల్ 1గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించి పంటలను కాపాడుకుని అధిక లాభాలు పొందాలని తెలిపారు.

అంతర్జాతీయ కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు పాండిచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 2 నుంచి 5 వరకు జాతీయస్థాయి కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు – 2024 ఐదు మంది విద్యార్థినిలు పాల్గొనగా అందులో ఒకరు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి భువనేశ్వరి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఎం.ధాత్రి మొ గధారమ్మను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వలన పోరాట స్ఫూర్తి అలవడుతుందని, వైఫల్యం వాస్తవానికి ఓటమి కాదని లక్ష్యసాధనలో అదొక అంతర్భాగమని అలాంటి సరికొత్త ప్రయత్నాలు పదేపదే చేసేవారు తప్పకుండా విజయం సాధిస్తారని అన్నారు. ఎం. ధాత్రి మొగధారమ్మ గోల్డ్ మెడల్, సి మహిమ, ఎస్ తేజశ్రీ, జై శైలజ, ఎం వదు వర్షినిలు గెలుపొందారు. వీరిలో ఎం.ధాత్రి మొగదారమ్మ ఉత్తరాఖండ్ హల్ద్వానిలోని ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కర్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరందరికీ చక్కని తర్ఫీదు ఇచ్చి అంత సుదూర ప్రాంతానికి తీసుకెళ్లిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఉసురు తీస్తున్న అప్పులు

గిరిజనులపై ఏజెంట్ల వల వేధింపులతో బలవన్మరణాలు 'వెట్టి'లో మగ్గుతున్న కుటుంబాలు

ప్రజాశక్తి - డక్కిలి: గిరిజనుల నిర్లక్ష్యరాస్యత ఏజెంట్లు, ఫైనాన్స్ వ్యాపారులకు 'పెట్టుబడి'గా మారింది.. పేదరికంతో మగ్గిపోతున్న వారికి అవసరం పేరుతో అప్పులిస్తూ, తడిచి మోపెడయ్యాక వేధిస్తూ ఫైనాన్స్ వ్యాపారులు (ఏజెంట్లు) లక్షలకు పడగలెత్తుతున్నారు.. తలకుమించిన అప్పులు కావడంతో, అవి తీర్చడానికి ఏజెంట్ల ద్వారా పనులకు వెళ్లడం వీరికి పరిపాటి. కూలి పనుల కోసం వలసెలుతున్న వీరికి కష్టాలే మిగులుతున్నాయి. పనులు చూపిస్తామన్న ఏజెంట్ల మాటలు నమ్మి వెళ్లిన వారికి అక్కడ ఉదయం నుంచి పొద్దుపోయే వరకూ కాయకష్టం చేసినా పొట్టకూటికి తప్ప, అప్పు పైసా తీరడం లేదు. దీంతో కొంతమంది రెక్కలు విరిగిన పక్షుల్లా స్వగ్రామాలకు చేరుతున్నారు. మరికొందరు చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయి బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే డక్కిలి మండలం దందవోలు ఎస్టీ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

డక్కిలి మండలం దందవోలు ఎస్టీ కాలనీకి చెందిన రవి ఉరఫ్ (దావీద్), చెంచులక్ష్మిలు భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలో పనులు లేకపోవడంతో తమకు తెలిసిన ఏజెంట్ ద్వారా వీరు అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని మందరం కొత్తపల్లికి చెందిన సిమెంట్ రాళ్ల వ్యాపారి వెంకట సుబ్బారెడ్డి వద్ద పనికి చేరారు. ఆ సమయంలో ఆ వ్యాపారి రవి దంపతులకు 76వేలు అప్పుగా ఇచ్చాడు. రోజుకూలి పూట గడవడానికే సరిపోయేది. అప్పు పైసా కూడా తీరకపోవడంతో వారు మనస్తాపం చెందారు. దీంతో ఆ దంపతులు కూలి ఎక్కువ ఇచ్చే రాపూరు మండలం గిలకపాడు వద్ద ఉన్న మరో సిమెంట్ రాళ్ల తయారీ వ్యాపారి వద్ద పనికి చేరారు.



బాధిత చెంచులక్ష్మి కుటుంబ సభ్యులు

గిలకపాడు వద్ద పనిచేస్తూ తాము సంపాదించిన 20వేలను గతంలో అప్పు ఉన్న వెంకట సుబ్బారెడ్డికి ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అయితే 15 రోజుల క్రితం వెంకట సుబ్బారెడ్డి గిలకపాడు సిమెంట్ రాళ్ల తయారీ పరిశ్రమ వద్దకు వచ్చి తమకు ఇవ్వాల్సిన మిగిలిన 56వేలు వెంటనే చెల్లించాలన్నాడు. అయితే రవి కొన్ని రోజులు గడువిస్తే రుణం తీరుస్తామని ప్రాధేయపడ్డాడు. అయితే వెంకట సుబ్బారెడ్డి రవిని కిడ్నాప్ చేశాడు. రోజులు గడిచినా భర్తను పంపించకపోవడంతో భార్య చెంచులక్ష్మి (30) మనస్తాపంతో శనివారం రాపూరు మండలం గిలకపాడు రోడ్డు వద్ద గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. చెంచులక్ష్మి మృతితో పదేళ్లలోపు పిల్లలు తల్లి ప్రేమకు దూరమై విలపించడం స్థానికులను కలచి వేసింది. గతంలోనూ వెంకట సుబ్బారెడ్డి దందవోలు గ్రామంలోని రవి బంధువులైన నాలుగు కుటుంబాల వారిని కిడ్నాప్ చేసినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. రవి తనకు చెప్పకుండా వెళ్లిపోయాడని, రుణం చెల్లించే వరకూ తన వద్ద పని చేయాల్సిందేనని ఆ నాలుగు కుటుంబాల వారిని బందీలుగానే ఉంచారని తెలుస్తోంది. అయితే దందవోలు సర్పంచి పెంచలయ్య జోక్యం చేసుకుని రవి అప్పు ఉంటే, వారి కుటుంబీకులను బందీలుగా ఉంచుకోవడం సరికాదని విడిపించినట్లు తెలుస్తోంది. గిరిజన కుటుంబాల్లోని నిరక్షరాస్యత, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని ఏజెంట్లు వారి శ్రమను దోచుకుంటున్నారని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. చెంచులక్ష్మి ఘటనతో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటిడిఎ అధికారులు దందవోలుకు మంగళవారం వెళ్లి విచారించి, నివేదికను సమర్పించారు.

చెంచులక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలి

టి.మల్లికార్జున్, యానాది సంక్షేమ సంఘం అధ్యక్షులు

చెంచులక్ష్మి మృతికి కారణమైన సిమెంట్ రాయి వ్యాపారి వెంకట సుబ్బారెడ్డిపై బాండెడ్ లేబర్ కింద కేసు నమోదు చేయాలి. ఎస్టీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద, ఐటిడిఎల ద్వారా చెంచులక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. గిరిజన కుటుంబాల్లో స్వయం ఉపాధికి రుణాలిచ్చి వారి అభ్యున్నతికి కృషి చేయాలి.


క్రైం న్యూస్

గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు



స్మగ్లర్ల అరెస్టును చూపుతున్న డిఎస్పి సాయినాథ్



నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న గంజాయి, కత్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి కేజీ 600 గ్రాముల గంజాయి, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి సాయినాథ్ తెలిపారు. గురువారం డిఎస్‌పి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ యువతకు గంజాయి విక్రయిస్తూ వారిని వ్యసనాలకు బానిసలను చేస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచినట్లు తెలిపారు. చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.నెట్టి కంటయ్య, ఎస్ఐ టి.ప్రసాద్ వారి సిబ్బందితో పట్టణంలోని ఇరువారం ఏరియాలో గంజాయి అక్రమ అమ్మకాలపై అందిన సమాచారంతో దాడి నిర్వహించారు. ఇరువారంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ వెనుక వైపు ఓ బైక్, రెండు ఆటోల్లో గంజాయి అమ్ముతున్న సెల్వం, జాషువ, లోకేష్‌ను అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, కత్తులు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను విచారించగా చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌కు చెందిన అల్లా బకాష్, వైఎస్ కాలనీకి చెందిన సిద్ధు అనే వ్యక్తి వైజాగ్ ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయిని చిత్తూరుకు అక్రమంగా రవాణా చేసి సప్లయ్ చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరులో మోహన్, ఏ.సంతోష్, సురేష్ అనే ముగ్గురు వ్యక్తులు వీరికి గంజాయి ఇచ్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ వ్యాపారంలో ఎవరైనా తమను అడ్డుకుంటే చంపాడానికి సైతం కత్తులను వద్ద ఉంచుకున్నట్లు ముద్దాయిలు అంగీకరించారు. అనంతరం కేసు నమోదు చేసి ముద్దాయిలను కోర్టులో హాజరు పరిచారు. అలాగే అల్లా బకాష్, సిద్ధు, మోహన్, సంతోష్, సురేష్, తులసి పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

ఆటో స్కూటర్ ఢీ- ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట కనుమ వద్ద ఆటో స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. గురువారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పచ్చికాపల్లం నుంచి తిరుపతి వైపు ద్విచక్ర వాహనంలో ఆకాష్ (26), ప్రభాస్ (22) వెళ్తుండగా తిరుపతి నుంచి వస్తున్న ఆటో రాజు కనుమ వద్ద ఎదురెదుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనం ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు.

సోమలలో నాకాబందీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి వద్ద ఎస్సై శివ శంకర్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించి వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇతర వాహన చోదకులు అన్ని రికార్డులు తమ వద్ద ఉంచుకొని ప్రమాదాలకు తావు లేకుండా అతివేగంగా ప్రయాణించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

పల్లం సురేంద్రపై దాడి చేసిన వారిని

వెంటనే అరెస్టు చేయాలి



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి- సదుం: ఊటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని, తుమ్మగుంటపల్లి గ్రామానికి చెందిన పల్లం సురేంద్ర పై దాడిచేసి గాయపరిచిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని మాల మహానాడు రాయలసీమ జిల్లాలు కార్యదర్శి నగిరి మడుగు సుభాష్ డిమాండ్ చేశారు. గురువారం మాలమహానాడు ఆధ్వర్యంలో సదుం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈనెల 12న జరిగిన సంఘటనపై సదుం పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారని, ఇంతవరకు సురేంద్రపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయలేదని, కనీసం డిఎస్పి స్థాయిలో విచారణ జరపలేదని వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సదుం ఎస్సై షేక్ షావలి బాధితుడు సురేంద్రకు న్యాయం చేస్తామని ఆందోళన చేపట్ట వద్దని వారికి నచ్చచెప్పడంతో వారు ఆందోళన ను విరమించారు. తుమ్మల ధరణీకుమార్, జెట్టి మల్లికార్జున, బద్దె భానుప్రకాష్, గుర్రం లోకనాథం, మద్దెల హరిబాబు, మద్దెల బాలగంగాధర్, ప్రభు తేజ, విజయ్ కుమార్, వెంకటరమణ, జనార్ధన, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ భారాలపై ధర్నా

తిరుపతి టౌన్: విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా శుక్రవారం ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు రూ.1,234.68 కోట్లు విద్యుత్ సంస్థలు చెల్లించడం అన్యాయం అన్నారు. ఈ భారాన్నీ ట్రూఅప్ ప్రతిపాదనలలో కలపడం శోచనీయమన్నారు.